కథా నిలయం
3823
శ్రీకాకుళం

# సంప్రదాయాల మేలిముసుగులో సమాజం

[ఆంధ్రప్రభ 9-4-85]

తప్పును సమర్థించడం నేరం, తప్పును క్షమించడం మానవత్వం ఇది సరికొత్త సంప్రదాయం.

—జయప్రద

"ఎంత తెలివి తక్కువ పని చేసాను?" మనసులోనే పశ్చాత్తాపపడ్డాడు సత్యధాత్రి తెల్లగా పాలిపోయిన స్నేహితుడి ముఖం చూసి.

"నువ్వు చెప్పింది నిజమా?" దీర్ఘరోగి గొంతుకలో బలహీనత, మానసిక రోగి గొంతుకలోని నైరాశ్యం కలిపిన మిశ్రమంలా ఉన్న స్నేహితుడి తగ్గుస్వరానికి కదిలిపోయాడు సత్యధాత్రి.

అది నిజం. పచ్చి నిజం. కానీ, ఆ నిజాన్ని బయటపెట్టి అతని జీవితాన్ని కాటేసే దుర్మార్గపు టాలోచన తన కెందుకొచ్చినట్టు! ఇంత సంస్కారహీనుడు తనెప్పుడయ్యాడు?

"చెప్పు సత్యా!" ఇక నిల్చోలేనట్టు కూలిబడిపోయాడతడు.

సత్యధాత్రి క్షణం ఆలోచించాడు.

'మనుషుల మనశ్శాంతిని దోచుకునే నిజం చెప్పడంకంటే అబద్ధం చెప్పి తను తన ప్రాణమిత్రుడికి మనశ్శాంతి ఎందుకివ్వ కూడదు!'

"నిజమే కదూ?"

"ఉహుఁ. విరించీ! మనుషుల్ని పోలిన మనుషులుండొచ్చు. ఆ అమ్మాయిని నేను ఒకటి, రెండు సార్లు మాత్రమే చూశాను. బహుశా ఈమె అయ్యుండకపోవచ్చు. లీవ్ ఇట్."

కళ్ళెత్తి క్షణం అనిమిషుడయినట్టు చూసాడు విరించి.

"ఆఫీసులో లీవ్‌లెటర్ ఇచ్చి వస్తాను. ఎక్కడకూ వెళ్ళకు. కూర్చో."

"నాకు కొద్దిగా...."

"ప్లీజ్...."

అతను వెళ్ళిపోయాడు.

శవం నడిచి వెళ్ళినట్లనిపించింది సత్యధాత్రికి. అతను వెళ్ళాక ఎదురుగా వున్న సింహద్వారానికి తల బద్దలు కొట్టుకోవాలనిపించింది. ఎంత మూర్ఖుడు తను! తను చేసిన పనికి పర్యవసానం....?

"అన్నయ్యగారూ! కాఫీ తాగుతారా?"

తుళ్ళిపడ్డాడతను.

'ఏమని పిలిచిందా అమ్మాయి!'

"కాఫీ వద్దు. కూర్చోండి మీరు."

ఆ అమ్మాయి సంకోచించింది.

"కాఫీ తెస్తాను."

'వద్దు, చెల్లెమ్మా. నువ్వు అయిదు నిమిషాలు కూర్చో చాలు."

ఆమె ధైర్యంగా కూర్చుంది.

అతను అధైర్యంగా కళ్ళెత్తి ఆమె వైపు చూసాడు.

ఎక్కడో మారుమూల అడవుల్లో కాంట్రాక్ట్సు చేసుకుంటున్న తను అక్కడే ఉండక స్నేహితుణ్ని చూడాలనే కోరికతో ఇక్కడ కొచ్చింది ఈ ఆడపిల్ల జీవితాన్ని ఛిద్రం చేయడానికా?

తన తొందరపాటు మన స్తత్వం వల్ల ఈ అమ్మాయి నష్టపోబో తూంది.

అలనాటు ప్రకారం మాటజారేసి ఇప్పుడు పశ్చాత్తాపపడి ప్రయో జనమేమిటి?

"ఏదో మాట్లాడాలనుకుంటున్నట్టున్నారు?"

ఆమె చిరునవ్వు అతణ్ని కాల్చేస్తూంది.

వాలిపోయిన కనురెప్పలతోపాటు పెదాల్ని కూడా బలవంతంగా విప్పాడతను.

"నేను పొరపాటు చేశానమ్మా. మీ వారితో...."

ఆమె మాట్లాడలేదు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తునట్టుగా చూసింది.

అతనికి సిగ్గుగా ఉంది.

ఇలాటి ప్రస్తావన ఓ ఆడపిల్ల దగ్గర తీసుకురావడం అదీ ఆమె ముందు దోషిగా నిలబడి....అతను ఎంత తొందరపాటు మనిషయినా ఇలాటి అనుభవం అదే ప్రథమం. ఎలా మొదలుపెట్టాలో అతనికి తెలీడం లేదు.

"చెప్పండి" ఆమె ఆత్రుతగా చూసింది.

అతనికి ఆత్రుతగానే వుంది.

'తన స్నేహితుడి ఆఫీసు ఇక్కడకు పెద్ద దూరమేమీ కాదు. అతను వచ్చేలోపల తను ఈ అమ్మాయితో చెప్పదలచుకుంది చెప్పేయాలి. కానీ, ఎలా చెప్పాలి? ఎవరిమీదో అయితే చెప్పడం తేలిక. కానీ....' అతను జారిన ధైర్యాన్ని మరో నిమిషానికి కొద్దిగా కూడగట్టుకున్నాడు.

చేసిన పనికి పశ్చాత్తాపపడుతూ నోరు విప్పాడు.

"నీ గురించి మీవారికి తొందరపడి చెప్పేశానమ్మా! నువ్వు నమ్మాలి. చెప్పేశాక చాలా బాధపడుతున్నాను. నా కుసంస్కారానికి సిగ్గుపడుతున్నాను."

ఆమె మొదట కొద్దిగా నెర్వస్‌గా ఫీల్ అయింది. వెంటనే సర్దుకుంటూ అంది.

"మిమ్మల్ని నేను గుర్తుపట్టాను. మీరు చంద్రశేఖర్ ఫ్రెండ్. నాకు తెలుసు. కానీ, మీరు మా గురించి మా వారితో చెప్పగలరని మాత్రం అనుకోలేదు. మీరే కాదు, నా గురించి నేను తప్ప మా వారితో మరెవరూ చెప్పలేరనే అనుకున్నాను. భార్య గురించి భర్తకు చెప్పగలిగేంత చిన్న విషయం కాదుగా అది?"

చెప్పున కొరడాతో కొట్టినట్లనిపించింది. తెచ్చి పెట్టుకున్న కొద్దిపాటి మనో ధైర్యమూ సడలిపోయింది. కానీ, స్నేహితుడు తిరిగి వచ్చేస్తాడనే భయం అతణ్ని మాట్లాడేలా చేసింది.

"క్షమించమ్మా! వాడు వచ్చేస్తాడేమో? నేను నీకు చెప్పదలచుకున్న దేమిటంటే, నేను వాడితో నేను పొరపాటు పడ్డానని అబద్ధం చెప్తాను.... నువ్వు మీవారడిగితే అలాటిదేమీ నీ జీవితంలో లేనట్టు కచ్చితంగా చెప్పు."

ఆమె దీర్ఘంగా అతనివైపు చూస్తోంది తప్ప అతనూహించినట్టు కన్నీళ్ళు పెట్టలేదు. అలా తన భర్తకు చెప్పినందుకు తనను చీదరించుకున్నట్టు చూడలేదు. ఇంతటి అపాయం నుంచి కాపాడే ఉపాయం చెప్పినందుకు కృతజ్ఞతగానూ చూడలేదు.

"ప్లీజ్! నా తప్పును సరిదిద్దుకోవడానికి నా కంతకంటే మార్గం కనిపించలేదు. నన్ను క్షమించి నాకీ సహాయం చేసి నా భారాన్ని దింపమ్మా!"

ఆమె చిన్నగా, దిగులుగా నవ్వింది.

"మీ భారాన్ని దింపమని నన్ను అడుగుతూ మీరు నాలో భారాన్ని పెంచుతున్నారు. యిలా మీరు చేయటం మీ స్నేహితుణ్ని మోసం చేయడం కాదా?"

అతనేమీమాట్లాడలేకపోయాడు. ఇలాంటి జవాబు అతను ఆశించనిది- ఊహించనిది.

"ఒక రకంగా మీకు నేను కృతజ్ఞురాలిని. ఈ రెండేళ్ళుగా అయనకీ విషయం చెప్పాలని ప్రయత్నించి ఓడిపోయాను నేను నా మనిషిని నేను మోసగించకూడదు అనే భావంతో చెప్పేయాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను.

బహుశా అయన నన్ను వదిలేస్తారనే భయంతోనో, ఆయన మనసు బాధపడుతుందనే భావంతోనో, లేక ఆయన్ని వదిలి బ్రతకలేకో నేను చెప్పలేకపోయాను. చాలా సునాయాసంగా ఆ విషయం ఆయనకు చెప్పి నాకు మేలు చేశారు."

ఆమె మాటల్లో నిజాయితీ వుందో వ్యంగ్యధోరణి వుందో అర్థం కాలేదు సత్యధాత్రికి. అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూండగానే ఆమే మళ్ళీ నోరు విప్పింది.

"నా పెళ్ళిమాట అనుకున్నప్పుడే మా అన్నయ్యతో చెప్పాను- విఫలమైన నా ప్రేమ విషయం అతనికి చెప్పి అతను ఒప్పుకుంటేనే ఈ పెళ్ళి చేసుకుంటానని. అందు కన్నయ్య నవ్వి అది మంచిపని కాదని కొట్టిపారేశాడు. పెళ్ళి నిశ్చయమయ్యాక కోటి భయాలతో నేనాయనకు ఉత్తరం రాసి పోస్టు చేయబోయేంతలో మా నాన్న దాన్ని చదివి నా మీద చెయ్యి కూడా చేసుకున్నారు.

నా పెళ్ళి, నా జీవితం నాకొక్క దానికే సంబంధించింది కాదనీ ఆ ఇంటి పరువు ప్రతిష్టలు నా మీద కూడా ఆధారపడి వున్నాయని నా నోరు నొక్కేశారు."

ఆమె ఎంతో ధైర్యాన్ని కూడదీసుకుని మాట్లాడుతున్నా తన జీవితం ఈనాటి నుంచి ఏమైపోతుందో అనే భీతి భావం వణికే ఆమె కంఠంలో ఆ తగ్గు స్వరంలో స్ఫురిస్తోంది. జీవితాన్ని పాడు చేసుకోవాలని ఎవ్వరికీ వుండదు. కాకపోతే విధి చేతిలో ఏమవుతాయో మనకు తెలీదు.

"నా వల్ల మీ జీవితం...."

ఆమె మళ్ళీ నవ్వింది. కానీ, ఏడుస్తున్నట్టుగా ఉంది ఆ నవ్వు.

"ఒకవేళ నా జీవితం పాడయితే మీవల్ల పాడయినందుకు బాధ పడకండి. ఓ ఆడపిల్ల జీవితం ఆ అమ్మాయి అమాయకత్వం వల్ల ఆ ఆడపిల్ల తొందరపడి వేసే అడుగువల్లే పాడయినందుకు ఆమె గురించి బాధపడండి"

ఈసారి సంబాళించుకోలేకపోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

సత్యధాత్రి గుండెలో వేడి ఆవిర్లు....'ఎంత తెలివితక్కువ పని చేశాడు తను! రెండేళ్ళుగా సాగిపోతున్న ఓ అందమైన కాపురంలో ఎంత అనాలోచితంగా సమస్య లేవదీశాడు!'

"ఏడవకమ్మా! విరించి తొందరపడి నిన్ను కాదనే నిర్ణయం తీసుకోకుండా నేను చేస్తాను."

ఆమె ఏడుపు ఆపింది.

"అన్నయ్యగారూ! యిలాంటి విషయాల్లో మగవాడికి స్వతహాగా క్షమించే మనో ధైర్యం వుండాలి కానీ, మీ సలహా ఆయన వింటారని నేననుకోను!"

"అలాంటప్పుడు నువ్వు నిజం చెప్పకపోతేనేం?"

ఆమె కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది.

"ఆయన వ్యక్తిగా మంచివారు, కాకపోతే నన్ను ప్రేమించ కుండా నాటకమాడే సగటు మగవాళ్ళలో ఒకరయ్యుంటే, మీరన్నట్టు అబద్ధం చెప్పగలిగేదాన్నేమో! కానీ, ఆయనకు నిజం తెలిసి నన్ను అడిగినప్పుడు అబద్ధం చెప్పడం నా చేత అవుతుందా? నన్ను ప్రేమించే మనిషిని నేను మోసం చేయలేనన్నయ్యగారూ!"

మరి మాట్లాడడానికి సత్యధాత్రి దగ్గర మాటలు కరువయ్యాయి.

★ ★ ★ ★

"స్వప్నా! నేనొక ప్రశ్న అడుగుతాను. నేను విన్నది అబద్ధ మయితే నన్ను క్షమించు, నిజమైతే అది ఎలాంటి నిజమైనా నా జీవి తాన్ని ధ్వంసం చేసే నిజమైనా నాకు నిజమే కావాలి" అతని స్వరంలో మార్దవం, పట్టుదల రెండూ వున్నాయి.

పొద్దుననగా వెళ్ళిన భర్త కోసం సాయంత్రం వరకూ ఎదురు చూస్తూ, ప్రతి క్షణమూ ఎదురొచ్చి తన భర్త వేయబోయే ఈ ప్రశ్న ఆమె తనకు తనే వేసుకుంటూనే వుంది అందువల్ల ఆ ప్రశ్న ఆమెకు కొత్తగా అనిపించలేదు.

అప్పుడనగా స్నేహితుణ్ని వదిలి వెళ్ళిన విరించి తిరిగి యింటికి వస్తే ఏం వినవలసి వస్తుందో అని ఊరంతా తిరిగి గుండె నిబ్బరాన్ని కొనుక్కుని తిరిగి వచ్చేసరికి సోఫాకి అతుక్కుపోయినట్టు కూర్చున్న స్నేహితుణ్ని చూసి కొంచెం ఆశ్చర్యపోయి, ఆలస్యానికి స్నేహితుడికి క్షమాపణ చెప్పి నేరంగా లోపలికొచ్చి, నీరసంగా పడకమీద ఎటూకాని వేళలో పడుకున్న భార్య పక్కన కూర్చుని ఉపోద్ఘాతం లేకుండా వేయాలనుకున్న ప్రశ్న అయితే వేశాడుకానీ, ఆ ప్రశ్నకు ఏం జవాబు వస్తుందో అని మనసులోనే వణికిపోతున్నాడు.

"మీరు విన్నది నిజమే!" తలెత్తి కళ్ళు వాల్చుకుని భయంగా అంది స్వప్న.

ఆమె నిర్భయంగా నిజం ఒప్పుకున్నందుకు సంతోషపడాలో, బాధపడాలో అర్థంకాని పరిస్థితిలో మరో ప్రశ్న వేశాడతను.

"నువ్వతనితో చాలా దూరం వెళ్ళావని...." అలాటి అసభ్యపు ప్రశ్న వేయడానికి అతని అంతర్యం సిగ్గుపడినట్లుంది. అందుకే మధ్యలో వాక్యాన్ని ఆపేసాడు.

"ఆఁ అతను తప్ప మరో మగవాడు నా జీవితంలో ప్రవేశిస్తాడనుకోలేదు. అందువల్ల....ఆమె తల వంచేసింది."

"మళ్ళీ నువ్వు అలాటి పొరపాటు చేసే అవకాశం వుందా?" అనే మూడో ప్రశ్న కోసం ఎదురు చూసిన ఆమెను నిరాశ పరుస్తూ ఆమె గుండె మీద నడుస్తూ నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోయాడతను.

తన స్నేహితుడి గదిలో నిశ్శబ్దం అలుముకోవడంతో భయంగా లేచి నిల్చున్నాడు సత్యధాత్రి. ఈ నాటకంలో తన పాత్ర అయిపోయినట్టు తను విశ్శబ్దంగా నిష్క్రమించడమా, లేక ఆఖరి సీనులో తన పాత్ర మిగిలి వుందా?" అని తటపటాయిస్తూ మరో అడుగు వేయకుండా నిల్చుండిపోయా డతను.

"ఇప్పుడు తను, కల్పించుకుంటే మంచి జరుగుతుందో, లేక నిశ్శబ్దంగా వెళ్ళిపోతే వీళ్ళు ఫ్రీగా మాట్లాడుకుని నిర్ణయాలు తీసుకోవడానికి బాగుంటుందో" అర్థం కాలేదతనికి.

విరించి తన దగ్గరకు వస్తాడని మరో అయిదు నిమిషాలు ఎదురు చూసిన సత్యధాత్రి మరి ఆగలేక ఆఫీసు గదిలో తల పట్టుకుని టేబిల్ మీద వాలిపోయి వున్న స్నేహితుడి దగ్గరకు నడిచి దూరంగా నిల్చున్నాడు.

"సారీ! విరించీ!"

అతను తలెత్తాడు.

"తొందరపడి నిర్ణయాలు తీసుకోకు... ప్లీజ్!"

"అలా అన్నాడే కానీ, ఆ అరక్షణంలో తానైతే ఏం చేసేవాడు? విరించి చేయబోయే దానికి భిన్నంగా చేసేవాడా?" అని ఆలోచించాడు.

'సలహాలివ్వడం అన్ని పనుల్లో కల్లా చాలా తేలికయిన పని' నిట్టూ ర్చాడు.

అలాగే అన్నట్టు తలూపాడు విరించి. అంత దీనంగా కనిపిస్తున్న స్నేహితుడ్ని చూడ్డం అదే ప్రథమం సత్యధాత్రికి.

విరించి తల్లికి కాన్సర్ అని తెలిసిన క్షణంలో కూడా విరించి చాలా బాధపడ్డాడు. కానీ ఇంత దీనంగా మాత్రం లేడు.

"వస్తాను."

"నాలుగు రోజులుండాలని వచ్చావు...."

"నాలుగు రోజుల తరువాత మరలా వస్తాను. కొద్దిగా పనుంది" అని అబద్ధమాడి ఆ ఇంటి గడప దాటేసిన సత్యధాత్రికి ఎక్కడి కెళ్ళాలో అర్థం కాలేదు.

* * * *

"తొందరపడి నిర్ణయాలు తీసుకోకు" అని ప్రాధేయపడ్డ స్నేహి తుడితో సరే అని తలూపాడు. కానీ, విరించికి వెంటనే నిర్ణయం తీసు కోవాలనుంది. ఆమెను మరో నిముషం కూడా భరించే శక్తి లేనట్లని పిస్తోంది.

ఎంత ప్రయత్నించి మనసును శాంతపరుద్దామన్నా, తన సొంతం అనుకున్న భార్య సర్వస్వం ముందే మరొకరికి అర్పించబడింది అనే సత్యం అతడ్ని పిచ్చివాడ్ని చేస్తోంది.

తల్లి బిడ్డ తనకే కావాలనుకోదు. ఎందుకంటే, బిడ్డ ప్రేమలో భాగం తన భర్తకు కూడా వుంది. కనుక బిడ్డ తన తల్లి తన సొంతమే కావాలని కోరుకోదు. కారణం-తన తోబుట్టువులకు కూడా తన తల్లి తల్లే కనుక. కానీ, తనకే కావాలని కోరుకునే మనిషి భార్యకు భర్త, భర్తకు భార్య. ఆ ప్రేమను మరొకరు పంచుకోవడం అనేది ఎవ్వరూ సహించలేరు. కానీ, ఆమెను కాదని పరిత్యజిస్తే ఈ సమాజానికి ఏమని జవాబు చెప్పాలి? బంధువుల ముందు ఎలా నిల్చోవాలి?

ఆమెను క్షమిస్తే....? కొద్దిగా అడ్జస్టు అయితే....?

ఉహుఁ....దానికి అతని మనస్సు అంగీకరించలేదు. ఆమెను స్వీకరించే ఉద్దేశమే జుగుప్సాకరంగా ఉందతనికి.

తల పగిలిపోతూంది. ఏదో ఒకటి చేయకపోతే శరీరం కూడా పగిలిపోయేలా వుంది చప్పున లేచాడు. మరుక్షణంలో శూన్యంలోకి చూస్తున్న భార్య ముందు నిల్చున్నాడు.

"నువ్వు మీ పుట్టింటి కెళ్ళిపో."

ఆమె ఏదో చెప్పబోయింది.

అతనా అవకాశం ఆమెకివ్వలేదు. చప్పున తలుపులు మూసి బయటకు నడిచాడు.

★ ★ ★ ★

నాలుగు రోజుల తరవాత విరించి ఇంట్లో భయం భయంగా అడుగు పెట్టిన సత్యధాత్రికి చిరునవ్వుతో ఎదురొచ్చిన స్వప్న ఆశ్చర్యాన్ని, ఆనందాన్నీ కూడా కలుగజేసింది.

★ ★ ★ ★

"థాంక్స్, విరించీ!"

ఈసారి శూన్యంగా, దయనీయంగా చూడలేదు విరించి. ఆ చూపుల్లో కొత్త శక్తి వుంది.

"థాంక్స్ నా కెందుకురా? ఇది నా జీవితం. దీన్ని చెడుపుకున్నా దిద్దుకున్నా ఆ బాధ్యత నాది. ఆ పర్యవసానం తాలూకు ఆనందం కానీ, విషాదం కానీ నాది."

"యు ఆర్ గ్రేట్."

"నో, ప్లీజ్.... నా ఆలోచనలు నీకు చెప్తే, నిజాయితీగా నా ఆలోచనా దర్పణాన్ని నీ ముందుంచితే నువ్వు నన్ను సహ్యించుకుంటావు.

ఆఖరికి ఆమెను హత్య చేయాలనుకున్నంత దూరం నా ఆలోచనలు వెళ్ళాయి. కానీ, కాలానికి చాలా మహిమ వుందిరా. ఆమె కన్నీళ్ళు నన్ను కరిగించలేదు. ఆమె ప్రార్థనలకు నేను లొంగిపోలేదు కేవలం కాలం నాలో తొంగిచూసిన రాక్షసుడ్ని చంపింది. అంతే! తీరిగ్గా ఆలోచించాను. ఇలాంటి తప్పే నా చెల్లెలు చేస్తే క్షమించి, ఆ పిల్లను మరొకడికి అంటగట్టనా? నా కూతురు చేస్తే ఇలాగే తరిమేస్తానా? రెండేళ్ళు కాపురం చేసిన భార్య ఆమె. వైవాహిక బంధం ఇంత తేలికైనదా వదిలేయడానికి? పైగా ఆమె తప్పు చేయాలనీ చేయలేదు. అతడ్ని తప్పకుండా పెళ్ళి చేసుకుంటుందనే నమ్మకంతో చేసింది. అతను మోసం చేసినందుకు ఆమెను జీవితాంతం శిక్షించాలా? శిక్షించాల్సి వస్తే వాళ్ళిద్దర్లో ఎవర్ని శిక్షించాలి? ఆలోచించాను.

నా భార్య నేను కాదంటే ఎక్కడ కెళుతుంది? అతని దగ్గరకా? తండ్రి దగ్గరకా?

ఒకవేళ అతని దగ్గర కెళితే తను ఆమె నింకా పతనంలోకి తోసినట్లు కాదా?

ఆలోచనలు వదిలించుకుని నేను వెళ్ళమన్నా వెళ్ళకుండా నన్ను తప్పించుకుని తిరుగుతున్న నా భార్యను నాలుగో రోజు అడిగాను.

"ఇక్కడ నుంచి నీవు వెళ్ళిపోయాక అతను స్వీకరిస్తానంటే వెళతావా?"

ఆమె ఇచ్చిన జవాబు నన్ను తృప్తిపరిచింది."

"ఏం జవాబిచ్చింది?" అసంకల్పితంగా అడిగేసి 'అడక్కుండా వుండాల్సింది' అనుకున్నాడు సత్యధాత్రి.

'మీ జీవితంలో ప్రవేశించాక ఇది తప్ప ఇంకో జీవితాన్ని భరించలేననుకుంటున్నాను. ఈ రోజు మీరు నన్ను కాదన్నా ఎందుకు కాదన్నారో అర్థం చేసుకోగలను. మీరు తిరిగి రమ్మంటే సంతోషంగా తిరిగి

రాగలను. కానీ, నా కర్థం కానిదల్లా అతనెందుకు కాదన్నాడనేదే! అతడ్ని క్షమించడం నాకు చేతకాదు.'

"ఆమెను నమ్మాను నేను. నిప్పులాంటి ఆ నిజాన్నే చెప్పినామె ఇప్పుడు అబద్ధం చెపుతుందనుకోను. పైగా ఆమె నన్ను ప్రేమిస్తూంది. ఆ సంగతి ఈ రెండేళ్ళుగా నాకు తెలుసు. ఆ ప్రేమలో నటన లేదు. నా భార్యను–నన్ను ప్రేమించే భార్యను–నేను క్షమించకపోతే ఈ సమాజం క్షమిస్తుందా? నేను కాదన్నాక ఈ సమాజం ఆమెను బ్రతక నీయకపోతే? ఆ ఊహే భరించలేకపోయాను. నాకీ రెండు సంవత్సరాలు ఎంతో అందమైన జీవితాన్నందించిన భార్య, ఏనాడో చేసిన తప్పుకు ఆమె నిండు జీవితాన్ని ఖర్చు చేయడం భావ్యం కాదనిపించింది. నిండు మనసుతో నాతో జీవితాన్ని కోరుకుంటూందామె. ఆమెను కాదనే శక్తి నాకు లేకపోయింది."

"విరించీ! నిన్నెలా అభినందించాలో నా కర్థం కావడం లేదు." సంతృప్తిగా నిట్టూర్చాడు సత్యధాత్రి.

"ఓకే. విరించీ! నాకిప్పుడు చాలా భారం తగ్గింది. నేను వెళతాను."

"వెళతావా? ఎక్కడికి?"

"హోటల్ కెళ్ళి సామాను తీసుకుని రాంచీ వెళ్ళిపోతాను."

"హోటల్లో వున్నావా ఒంటరిగా నాలుగు రోజులనుండి? ఎలా?" ఆశ్చర్యపోతున్న స్నేహితుడ్ని చూసి నవ్వాడు.

"నా తప్పుకు శిక్ష ననుభవిస్తూ...."

"ఇందులో నీ తప్పేముంది?"

దీర్ఘంగా చూశాడు సత్యదాత్రి. "వెల్, విరించీ! ఆల్ ది బెస్ట్" తృప్తిగా కదిలాడు.

*    *    *    *

కథ చదవడం పూర్తిచేసి పుస్తకం మూశాడు మాధవ్.

"ఎలా వుంది కథ?" అడిగింది బిందు.

"నచ్చింది" తన గర్ల్ ఫ్రెండ్‌వేపు తిరుగుతూ అన్నాడు.

"నాకు నచ్చింది కనకనా?" అల్లరిగా నవ్విందామె.

"నీకు నచ్చిందని నాకు నచ్చాలా?' తెలివిగా జవాబిచ్చా నను కున్న బాయ్‌ఫ్రెండ్‌మీద మరో విసురు విసిరింది బిందు.

"మన ప్రేమ వయస్సు చిన్నది కదా! ఆ మోజులో...."

"నో. నో. నేను చంద్రశేఖర్‌ని కాను. మోజు వేరు, ప్రేమ వేరు కాదు. నా దృష్టిలో ప్రేమించిన మనిషిని చంద్రశేఖర్‌లా మోసగించనూ లేదు, నాకు నచ్చని విషయాలు నీకు నచ్చాయి కదా. అని నీ మెప్పు కోసం నచ్చిందనీ చెప్పలేను."

"థాంక్స్" ఆమె కళ్ళు మెరిశాయి.

"ఇంతకూ కథ పూర్తిగా నచ్చిందో లేదో చెప్పలేదు."

"నచ్చలేదనీ చెప్పలేను, పూర్తిగా నచ్చిందనీ చెప్పలేను. తప్పు చేసిన వాళ్ళని క్షమించడమన్నది ఔన్నత్యమే. నేను కాదనను.

కానీ, చదువుకు పంపిస్తే గోళీకాయలాడే కొడుకుని తన కొడుకే గనుక కొడితే బాధపడతాడు గనుక కొట్టకూడదని తండ్రికి అనిపించ వచ్చు. కానీ, కొట్టాలి....తప్పదు. ఈ క్షమాగుణంవల్ల మిగతా పిల్లలు చెడిపోకూడదు."

"అంటే?"

"భర్తలిలా క్షమిస్తూపోతే, ఆడపిల్లలు తప్పులుచేస్తూ పోతే.... ఈ సమాజం కిట్టుబాట్లు...."

"అంటే మీ ఉద్దేశం ఈ సమాజం మగవాళ్ళని క్షమిస్తూందిగనుక వాళ్ళు తప్పులు చేసుకుంటూ పోతున్నట్టే రేపొద్దున పెళ్ళయితే, భర్తలు క్షమిస్తారు కనుక ఈనాటి టీనేజ్ ఆడపిల్లలు నిర్భయంగా తప్పులు చేస్తారని కదూ? మాధవ్!

ఏ ఆడపిల్లయినా కాలు జారిందంటే మనసు పారేసుకున్నాకే కాలు జారుతుంది. ఆ మనసు పారేసుకున్నవాడిని పెళ్ళి చేసుకుంటాననే ధైర్యంతో, అతని మీద విశ్వాసంతో అతణ్ని కాదనలేని బలహీనతతో తప్పు చేస్తుంది. కానీ, ఒకవేళ ఇతను మోసగిస్తే ఏం?

'నా కాబోయే భర్త క్షమిస్తాడులే' అని మాత్రం కాదు. కారణం- ఆమె మగవాడు కాదు. ఆడది. ఆడదాని మనసు మనసునే కోరుతుంది. ఏమంటావు?"

అతను మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు. ఆలోచించాక ఒప్పుకున్నాడు.

"నువ్వన్నదీ నిజమే."

❋